


ఈ చీకటి విడలేదు.

ఈ చీకటి విడదు, ఇంత వేగిరం విడదు.

శతకోటి సింహాచలాలు అరిచినా విడదు:

కరిస్తేనే విడుతుంది.

—రాచకొండ విశ్వనాథశాస్త్రి.

హొరైజాన్‌మీంచి అడుగెత్తులేచి సూరీడు లోకంమీద కొచ్చే వేళకి సింహాచలం గుడిదగ్గర కొచ్చేశాడు. సింహాచలానికి పట్టుమని పదేళ్ళుండవు. వాడి అయ్య అప్పలకొండ బతికుండీ చదివిస్తే వీడీపాటికి ఫస్టు ఫారంలో కొచ్చేసును. తెలివైనవాడూ చురుకైనవాడూ కాబట్టి ఫస్టు మార్కులు తెచ్చుకునేవాడే. కాని ఆ అదృష్టం సింహాచలానికిలేదు. రెండు పూట్లా కడుపునిండా సారాతాగి అయ్య తనను తను చంపేసుకునే సమయానికి సింహాచలానికి అయిదేళ్ళు. పలక పట్టుకుని బళ్ళో కెళ్ళవలసిన వయసులో కడుపు పట్టుకుని వీధినబడ్డాడు సింహాచలం. వాడికి వాళ్ళయ్య మిగిల్చిన ఆస్తంతా ఓ రోగిష్టితల్లీ, ఓ మాటలురాని చెల్లీ. తల్లిపేరు కనకమయితే చెల్లిపేరు లక్ష్మి.

మొదట్లో పాచిపనులుచేసి పిల్లలిద్దరికీ యిన్ని గంజినీళ్ళు పోసేది కనకం. ఆ తర్వాత మలేరియా వచ్చి, మంచంపట్టేక, కోలుకుని శవంలా అయ్యాక చాలపన్లు మానేసుకుంది. దాంతో సంపాదన తగ్గింది. ఇంట్లో ఆకలి పెరిగింది. సరిగ్గా అప్పుడే సింహాచలం లోకంలోకొచ్చాడు. దగ్గర్లో వున్న దేవాలయంలోకి వెళుతున్న జనం వాడిని ఆకర్షించారు. 'దేవుడంటే ఎవరూ?' అనే అనుమాన మొచ్చిందప్పుడే వాళ్ళమ్మ నడిగాడు.

'దేవుడంటే మనిషికాడూ గొప్పవాడూ' అంది వాళ్ళమ్మ.

అయితే అతనికెందుకు దండం పెట్టడం అనే మరో అనుమాన మొచ్చింది సింహాచలానికి.

'దండం పెట్టాలంతే' అంది వాళ్ళమ్మ. పెడితే కావలసిన విస్తాడంది. అయితే ఎవరికేది కావలిస్తే వారికది దేవుడు దండం పెట్టించుకున్నాకనే యిస్తాడన్న సంగతి అప్పుడే తెల్సుకున్నాడు సింహాచలం. అన్నివుండి, డబ్బున్నవాళ్ళే దేవుడి దగ్గరకెళుతుంటే నేనెందుకు వెళ్ళ

కూడదూ? అనుకున్నాడు. అలా అనుకున్న రోజునే వెళ్ళేడు. దేవుణ్ణిచూసి దండం పెట్టేడు ఆకలి తీరేట్లు చెయ్యమని కోరుకున్నాడు. దండం పెట్టి బయటకొస్తూంటే డబ్బూ, అందమూ గల ఒకావిడ కొరెక్కటోతూ సింహాచలాన్ని కేకేసింది. అంతవరకూ సింహాచలాన్ని దూరంగా పొమ్మనేవారే కన్పించారుగాని రమ్మనేవారు కన్పించలేదు అంచేత ఆవిడ దగ్గరకు పరిగెత్తుకెళ్ళేడు. కొబ్బరిచెక్కా, అరిటిపండూ వాడి చేతిలో పెట్టి తీసుకోమని సౌంజ్ఞచేసి కొరెక్కటోలు తలుపేసుకుందావిడ.

సింహాచలం ఆవిడవంక ఆశ్చర్యంగా చూశాడు. తన కోరికను మన్నించి దేవుడు పంపిన మనిషేమో ఈవిడ అనుకున్నాడు.

సరిగ్గా ఆనాటినుండే సింహాచలం దినచర్యలో మార్పు వచ్చింది. మనల్ని ఆదుకునేందుకు దేవుడొకడున్నాడూ అనే నమ్మకం కూడ కుదిరింది వాడిలో. అంచేత రోజులో సగభాగం గుడిదగ్గరే గడిపేవాడు. వచ్చిన ప్రసాదంలో తనుసగంతిని, మిగిలింది యింటికి తీసుకెళ్ళేవాడు.

ఎండ యింకా ముదర్లేదు. చెరువు గట్టుమీది కొంగలా గుడిముందు గట్టుమీద కూర్చున్నాడు సింహాచలం. ఆ రోడ్డమ్మట కాన్వెంటుకుపోయే పిల్లలు రెక్కలురాని కొంగల్లా కన్పించారు వాడి కళ్ళకి. ఆ కాన్వెంటు పిల్లలు యింగ్లీషులో మాట్లాడుతుంటారు, పోట్లాడుకుంటారు, పాటలు పాడుకుంటారు, పద్యాలు చెప్పుకుంటారు. వాళ్ళని చూసి సింహాచలం మనసు అసంతృప్తిగా మూల్గుతుంది.

వాళ్ళు చక్కగా వున్నారనికాదు. తను లేదేఅని!

లోకంలోని మనుష్యుల్ని రెండురకాలుగా విభజించవచ్చు. తమకు లేదని యేడ్చేవాళ్ళూ. ....వాళ్ళలో సింహాచలం మొదటి కోవకు చెందినవాడు.

సింహాచలం దృష్టి మరల్చుకుని చూసేసరికి ఎదురుగా పెద్దిరాజు

కన్పించేడు. పెద్దిరాజుకూడ ప్రసాదాల భక్తుడే. వాడితోపాటు మరో నలు గురుకూడా వున్నారు సింహాచలానికి పోటీగా.

సింహాచలం గుడివంక చూస్తూ కూర్చున్నాడు. అప్పుడే భక్తులు ఒకరూ ఒకరూ వస్తున్నారు.

సూరీడు కాస్త బైటకొచ్చి ఎండ కరకరలాడ్డంతో సింహాచలం కడుపులో పేగులు కరకరలాడ్డం మొదలుపెట్టాయి. రాత్రెప్పుడో తాగిన గంజినీళ్ళు ఎప్పుడో అరిగిపోయాయి.

అమధ్య జబ్బుచేసి కనకం పన్లోకెళ్ళడం మానేస్తే రాని రోజులకు మినహాయించుకుని మిగిలిన డబ్బే చేతికివ్వడంవల్ల యింట్లో గంజినీళ్ళు దొరికే దిక్కుకూడ లేకపోయింది.

అంచేత, 'కోణీదొరికిందిరారా' అని పెద్దిరాజు అనేసరికి ఎగిరి గంతేసి ఒక్కంగలో వాడిదగ్గిరకు వెళ్ళేడు సింహాచలం. మొట్టమొదటి ప్రసాదం ఎవరికి దక్కినా అది అందరూ పంచుకోవాలనే రూలువాళ్ళలో వుంది.

అరటిపండు ముక్క నోట్లో వేసుకుని దేవస్థానం కుళాయి నీళ్ళు కడుపునిండా తాగేసరికి ఎక్కడలేని శక్తి వచ్చినట్లయింది సింహాచలానికి.

'యేత్రా గుంటల్లారా, అప్పుడే తెల్లారిపోయిందేటి — దోరుదాటి బైటికి పదండిముందు' అంటూ గద పట్టుకొచ్చే యముళ్ళా కర్ర పట్టు కొచ్చేడు వీరాసామి.

వీరాసామి దేవస్థానం కాపలాదారు. ఆరడుగుల విగ్రహం, బొత్తు మీసాల్తో భయంకరంగా కన్పిస్తాడు. గొంతుతోనే అదిలించి జనాన్ని అదుపులో పెట్టే సామర్థ్యముందతనికి. దేవుడి దగ్గర అందరూ సమానమే అయినా కార్లలో వచ్చేవారికీ కాలినడకనవచ్చే వారికీ ఎవరి అంతస్తును బట్టి వార్ని గౌరవించగలిగే నేర్పుందతని వద్ద. బెల్లంమీద మూగిన

యీగల్ని తోలేసినట్లు ప్రసాదాలకోసం గుడికొచ్చే గుంటల్ని తోలేస్తాడతడు. అందుకే వారిపట్ల వీరాసామి యమధర్మరాజు.

మెట్లుదిగి రోడ్డుమీదికొచ్చాడు సింహాచలం. సరిగ్గా అప్పుడే వచ్చి ఆగిందో కారక్కడ. అది కారులాలేదు. గండభేరుండ పక్షిలా వుంది. కుబేరుడి వాహనంలా వుంది. అందులోంచి దిగినవాళ్ళు మనుషుల్లా లేరు. రాక్షసుల్లాగూ లేరు. దేవతల్లావున్నారు. వారి వంటిమీది బట్టలు దేవతా వస్త్రాల్లా వున్నాయి. వాళ్ళు మామూలు దంపతుల్లా కాకుండా ఆది దంపతుల్లా కన్పించారు సింహాచలం కళ్ళకి. వాళ్ళ పక్కనున్న అయిదేళ్ళ ఆడపిల్ల, బంగారురంగు గౌను వేసుకున్న దంతబొమ్మలా వుంది. ఆ పిల్లని చూస్తుంటే తన చెల్లెలు గుర్తుకొచ్చింది సింహాచలానికి. ఒకే యీడువారైనా వారిద్దరిలోనూ ఎంత తేడా వుంది. అనుకున్నాడు. కాని ఆ తేడాకి సరియైన కారణమేమిటో మాత్రం వూహించలేకపోయాడు. గొప్ప, బీద తారతమ్యాల గురించిగాని; సంఘానికి అడ్డుగోడలుగా నిలిచిన యీ అంతస్తులు, వాటిమధ్య నలిగిపోయే జీవితాలగురించి గాని; వాటివెనుక రగిలే పగ, ద్వేషాలగూర్చిగాని సింహాచలానికి నిశితంగా తెలీదు—తెలుసుకునే వయసూ కాదు.

ఎండ వేడెక్కింది. గట్టుమీద కూర్చుని గుడిలోంచి వచ్చే వారి వంక ఆశగా చూస్తున్నాడు సింహాచలం. మరో నాలుగు కొబ్బరి ముక్కలుదొరికితే తను యింటికెళ్ళిపోవచ్చు. ఇంతలో....లోపల్నించి వస్తూన్న ఓ ఆసామి అతని కళ్ళబడ్డాడు. దేవుడిముందు ఎన్నో కోరికలు కోరుకుని కోరికకో కొబ్బరికాయ చొప్పున కొట్టినట్టు అతని దగ్గర చాల కొబ్బరి చెక్కలున్నాయి. తనకొకటైనా దక్కకపోదు అని గట్టుదిగాడు సింహాచలం. ఆ వచ్చినాయనకి నలభై యేళ్ళుంటాయి. బయటకొచ్చి ఏదో వెతుకుతున్నాడతను. దృష్టినంతా అతని పైనే నిలిపి చూస్తున్నాడు సింహాచలం. అతగాడు వాచ్‌మన్‌ని పిలిచి యేదో అడిగాడు. వాచ్‌మన్

చుట్టూ చూసి; తల తాటించి సింహాచలాన్నీ తతిమ్మా గుంటల్నీ కేకేశాడు. ఆశ్చర్యంతో చూస్తున్న సింహాచలం ఒక్కంగలో అక్కడకు చేరు కున్నాడు.

"ఏరా గుంటల్లారా. బాబుగారి కొత్తచెప్పులు కనపడ్డంలేదంట— మీరెవరన్నా చూశార్రా."

వీరాసామి మాటలకు సింహాచలం గుండెల్లో రాయిపడింది. నిశ్చ లంగావున్న ఆకాశంపై కారుమబ్బులు కమ్ముకున్నట్లు అతని మనసంతా అల్లకల్లోలమైంది. మాకు తెలీదంటే మాకు తెలీదన్నారంతా. పెద్దిరాజు మాత్రం సింహాచలం వంక చూశాడు. ఆ చూపులో వున్నదేదో గ్రహిం చిన సింహాచలానికి కాళ్ళలో వణుకు ప్రారంభమైంది.

"ఈ దేవత గుడికాడ యిట్లాంటి దొంగతనాలెప్పుడూ జరగలేదు జరగలేదు బాబూ ఎవరన్నా పొరపాట్న తొడుక్కెళ్ళేరేమో" అన్నాడు వీరాసామి. ఆ మాటల్లో తన పనిమీద తనకున్న విశ్వాసముంది. అతను నమ్ముకున్న దేవతమీద భక్తి వుంది.

చెప్పులు పోగొట్టుకున్నాయనేం మాట్లాడలేదు. ఎవరూ తియ్య కుంటావుంటే ఎట్లా పోతాయి అన్నట్లుందాయన ముఖం. ఆ ముఖం చూశాక వీరాసామికక్కడ అదే ప్రశ్న మెదడులో ప్రవేశించింది. అతనికి అనుమానించడానికి యింకెవరూ దొరకలేదు. ప్రసాదాలకోసం పాకుల్లాడే గుంటల్తప్ప.

'ఎవడోకడు మీలోవాడే తీసుండాలిరా. లేపోతే చూసన్నావుండాలి. నిజం చెప్పకపోతే ఒక్కొక్కడికీ తగుల్తాయి గుమ్కీలు' అంటూ కర్రెత్తేడు. వీరాసామి తల్చుకుంటే ఏమైనా చెయ్యగల్డు. పోయ నేడాది అమ్మోరి పండక్కి ఎవడో గుంటడు దొమ్మి చూసుకుని జేబులు కొట్ట బోతుంటే పట్టుకుని రోజంతా లైటు స్తంభానికేసి కట్టేసుంచేశాడు. వాడు తిన్న దెబ్బలూ, వాడు తిట్లూ విని చూసినవాళ్ళందరికీ వీరాసామి ఎంత

కర్కోటకుడో తెలుస్తుంది. వీరాసామిలోవున్న గుణమేమిటంటే.... మంచోళ్ళతో, వెన్నలా మెత్తగానూవుండగల్డు; పెంకివాళ్ళతో పొయ్యిలో కర్రలానూ వుండగల్డు. అంచేత... యిప్పుడు వీరసామి ఎత్తిన అవతారం చూసిన గుంటలంతా జడుసుకుని బిక్కచచ్చిపోడంలో ఆశ్చర్యంలేదు.

"సిమ్మాచలం గోడిందాక తీస్తుంటే నాన్చూసినాను." అన్నాడు పుసుక్కున సూకరాజు. సూకరాజు అర్భకుడే కాదు భయస్తుడు కూడా!

ఆ మాటవిన్న సింహాచెలం మనసు బోన్లోపడ్డ పులిలా గిజగిజ లాడింది.

'ఔను నానూ చూసినానంటే నానూ చూసినా' నన్నాడు అప్పి గాడూ వీర్రాజూ.

"ఏరా! తీసినావా" అన్నాడు వీరాసామి కెళ్ళెర్రజేస్తూ. వీరాసామి కళ్ళు ఎర్రగోళీకాయల్లా కాకుండా; మండుతున్న నిప్పుకణికల్లా వున్నాయి.

వీరాసామి చేతిలో నలుగుతూన్న సింహాచెలం చొక్కా సింహం నోట్లో చిక్కిన కుందేలు పిల్లలా కరకరలాడింది.

"అవున్నానిందాక తీశాను. కానవి బాబుగారివవునో కాదో నాకు తెలీదు" అన్నాడు సింహాచలం.

ఆ మాటకి చెప్పులు పోగొట్టుకున్నాయనా, వీరాసామీ కూడా తెల్ల బోయారు. మహామహులే ఒప్పుకోని నిజాన్ని పీడెలా ఒప్పుకున్నాడా అనికాదు. అంత ధైర్యంగా ఎలా చెప్పగలిగేడా అనే.

"ఎక్కడ దాచినావో తెచ్చిచ్చీ" అన్నాడు వీరాసామి గుప్పిట్లోని చొక్కా వదిలిపెట్టి.

"నాను దాచనేదు. నాకెందుకని" సింహాచలం మాటలకి మరిం తాశ్చర్య పడ్డాడు చెప్పులు పోగొట్టుకున్నా యన.

"నాటకాల్జేస్తున్నావేట్రా" గూబ గుయ్యిమనిపించాడు వీరాసామి. ఆ దెబ్బ చావుదెబ్బలా తగిలింది సింహాచలానికి. నిర్భావికి లోతుకు

పోయిన కళ్ళు పచ్చబారి చెమ్మగిల్లాయి. తననే కేంద్రంగా చేసుకుని అమ్మవారి గుడితో సహా అంతా తనచుట్టు తిరిగినట్టయింది సింహాచెలానికి. ఆ స్థితిలో వాడినిచూస్తే చెప్పలేనంత జాలి కలిగింది దెబ్బలు పోయిన అయ్యవారికి. కాలేజీ పిల్లలముందు పులిలా అరిచే ఆయన కూడ పిల్లిలామారి వీరాసామిని వారించి, "నిజం చెప్పు నాయనా. నా జోళ్ళేం చేశావ్" అన్నాడు సింహాచలంతో సౌమ్యంగా. వీరాసామి దెబ్బకూడ రానిఏడ్పు అయ్యవారు ఓదారిస్తే ఉప్పెనలా ముంచుకొచ్చింది సింహాచలానికి ముత్యపు చిప్పల్లాంటి కళ్ళనుంచి కన్నీళ్ళు టపటపా రాలి పడ్డాయి.

"నీ కర్థమౌతాయిస్తాను. తొరగా తీసుకురా. పో" లంచం కూడ ఎరచూపాడు అయ్యవారు.

డబ్బుమాట వచ్చేసరికల్లా సింహాచలానికి పొద్దుగంట క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు నిలిచింది.

* * *

తననెవరో పిలుస్తున్నట్టై తలెత్తి చూశాడు సింహాచలం. ఆలయ ముఖద్వారాని కెదురుగా అరుగుమీద కూర్చున్న ఓ ఖరవైయేళ్ళతను పిలుస్తున్నాడు.

గట్టుదిగి అటువైపు అడుగులు వేశాడు.

"చూడూ నీ పేరేంటి"

"సింహాచెలమండీ."

"ఆ గుమ్మం దగ్గర అట్నించి రెండో జత జోళ్ళలా పట్టుకొస్తావ్" అన్నాడతడు.

అర్థంకాక అయోమయంగా చూశాడు సింహాచలం.

"నావేన్రా బాబూ. అక్కడకెళ్ళి వేసుకునే ఓపిక లేదు." అంటూ ఓ పదిహేను పైసలుతీసి వాడిచేతిలో పెట్టాడు. ముందు తేగూడదనుకున్నా

పైసలు చేతిలో పడేసరికి మరి మాట్లాడలేక పోయాడు సింహాచలం. పైగా అతని కాళ్ళకు చెప్పులులేవు ఖరీదైన బట్టలే వేసుకున్నాడు. చుట్టూ నలుగురు స్నేహితులుకూడ.

అందుకే మరో ఆలోచన రాలేదు.

*　　*　　*

ఆ సంగితే వున్నదున్నట్టు చెప్పేడు.

"ఛవ్ దొంగనాయాలా. ఎవుడికో అమ్మేసి. పైగా కట్టుకథలు చెప్తావట్రా" అని, అయ్యగారి వంకచూసి "యీడు సినిమా కతలు విని మోసపోకండి బాబూ. ఈడిచేత నిజమెలా చెప్పింతాలో నాకుదెల్సు" అంటూ ముందుకొచ్చాడు వీరాసామి.

"దార్నపోయేవాడెవుడో ఒచ్చి అడిగితే నువ్వేందు కివ్వాల్రా" అని ప్రశ్నించేడు, "నువ్వెవుడి కిచ్చిందీగాదు పోయింటు, నువ్వేందు కిచ్చావూ అన్నదే కొశ్చను" అన్న ధోరణిలో.

సింహాచలానికి నోట మాట రాలేదు. వాడినేం చేస్తే యింకా నిజం చెప్తాడో అన్నీ చేసేడు వీరాసామి. కానీ ఫలితంలేదు. కష్టదశలోవున్న సినిమా హీరోయిన్ని రక్షించలేని ప్రేక్షకుడిలానే చూస్తూ నిల్చున్నా రందరూ.

"నేను చెప్పింది నిజం. అంతకుమించి నాకేం తెలీదు" అన్నాడు చివరికి. అది తప్ప మరో మాట రావడంలేదు, సింహాచలం నోటినుంచి. వాడి ఒళ్ళంతా పుండుమీద కారం అద్దినట్టుగా దెబ్బలకు మండుతోంది. ఆ మంట ముందు కడుపులో పేరుకున్న ఆకలిమంట తెలీటంలేదు వాడికి.

వాడి కళ్ళలో నీళ్ళు యింకిపోయాయి!

స్తంభానికి వెనక్కి కట్టినవాడి చేతులపై తాడు రాపిడికి చర్మం లేచింది!!

చెప్పులు పోగొట్టుకున్న అయ్యవారు మాత్రం అయ్యవార్లా కాక నిప్పులు తొక్కిన కోతిలా గెంతి చేసేదిలేక వెళ్ళిపోయాడు.

వీరాసామి కూడ చేసింది చాలునని నరశింహావతారం మార్చి తన పనిలో లీనమయ్యాడు. కొద్దిసేపట్లోనే సింహం సగం తినేసి వదిలేసిన లేడి శరీరంలా వంటరిగా అసహ్యంగా వదిలివేయబడ్డాడు సింహాచలం.

ఆ క్షణంలో తనపై తనకే అసహ్యమేసింది సింహాచలానికి. ఎదురుగా కన్పించే దేవుడిగుడినిచూస్తే పూర్వంలా గొప్పగా అన్పించలేదు. తన కళ్ళముందు జరిగే అన్యాయాలను చూస్తూ కూడ మౌనం వహించే యీ రాతిబొమ్మకంటే మామూలు మనిషి నయమనిపించింది. ఎవరో దయ తలచి యిచ్చే ప్రసాదాలను తింటూ అవి దేవుడే యిస్తున్నాడని యిన్నాళ్ళూ తనెంత గుడ్డిగా నమ్మేడో అప్పుడర్థమైంది. దేవుడంటూ వుంటే యీ తేడాలూ, ఈ దరిద్రాలూ, అన్యాయాలూ, అక్రమాలూ వుండేవా అని తనలో తనే ప్రశ్నించుకుని సమాధానపడ్డాడు. అప్పటివరకూ తెలియని సత్యమేదో అవగతమైనట్లు వాడి కళ్ళు మెరిశాయి.

*　　　　*　　　　*

సరిగ్గా అదే సమయంలో యిందాకా సింహచలంచేత చెప్పులు తెప్పించుకుని తోడుక్కెళ్ళిన సత్యానందం కళ్ళు ఆనందంతో మెరిశాయి.

తనచుట్టూవున్న స్నేహితుల మధ్యలో కాకులమధ్య హంసలా, ఎక్స్ట్రాలమధ్య హీరోలా, మామూలు ప్రజలమధ్య ప్రజానాయకుడిలా వెలిగిపోతున్నాడు సత్యానందం.

"మాటంటే మాటే. లేకపోతే క్లాసులో అందరిముందూ నా అతం చూస్తానంటావా?" అన్నాడు గర్వంగా.

"వాడి రోగం కుదిర్చావు సరే. మరిప్పుడివేం చేస్తావ్?" ప్రశ్నించాడు సంత్యానందాన్ని పనిని పురిగొల్పిన శ్రేయోభిలాషి అప్పారావు.

"యేముందీ. యే చెప్పులు కుట్టేవాడికిచ్చినా ఈరోజు మన సిగిరెట్టుకి లోటుండదు." ఘనకార్యమేదో చేయబోయేవాడిలా నవ్వేడు.

* * *

ఆరోజు సాయంత్రం వడదెబ్బతిన్న కాకిపిల్లలా గూడుచేరిన సింహాచలానికి ఆప్యాయంగా ఎదురొచ్చి సేద తీరుస్తుందనుకున్న అతని తల్లి రాలేదు.

వేపచెట్టు జల్లిన చీకటి కల్లాబని చూస్తూ గుమ్మంలోనే కూర్చుండిపోయిన సింహాచలానికి మాటలురాని మరబొమ్మలాంటి చెల్లెలు సంజ్ఞకు అనిరి లోపలికి అడుగుపెట్టాడు.

తాళ్ళు తెగిన నులక మంచంలో విరిగిన బొమ్మలా పడుకున్న వాడి తల్లి పామునోటబడ్డ కప్పలా మూలిగింది.

సింహాచలం మనసులో దుఃఖం వుప్పెనలా పొంగింది. కళ్ళలో నీటిచుక్క లేదు!

చెల్లెల్ని దగ్గరకు తీసుకుని తలనిమిరి జోకొట్టాడు.

కళ్ళు ఎప్పుడు మూతలు పడ్డాయో! మెలుకువవచ్చి చూసేసరికి గుడిసెపైన కాకులు అరుస్తున్నాయి.

లేచి, తల్లి మంచం దగ్గరకువెళ్ళి ఆమె గుండెలమీద చెయ్యి వేశాడు.

బాధలేదు. మూల్గులేదు. అయాసంలేదు. ఆవేశమూలేదు. నిశ్చలంగా మంచు కట్టెలా చల్లగా వుంది.

అప్పటికింకా చీకటి విడిపోలేదు.

(భారతి. సెప్టెంబర్ 1980)